క్లుప్తంగా

నేడు మాలల ఆత్మీయ సమావేశం

సాక్షి,సిటీబ్యూరో: మాలల ఆత్మీయ సమావేశాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బాతి శ్రీకృష్ణ అన్నారు. కూకట్‌పల్లిలోని మెట్రోమాల్ వద్ద ఉన్న దాయర్‌గూడ అంబేడ్కర్ పార్కు వద్ద జరిగే ఈ సమావేశానికి మాలలు, ఎస్సీలు హాజరుకావాలని కోరారు.

ఇన్ఫినిటీ డ్రైవ్ ఇన్ యజమానిపై చీటింగ్ కేసు నమోదు

గచ్చిబౌలి: ఇన్ఫినిటీ డ్రైవ్ ఇన్ యజమాని వెలగపూడి రఘు తేజపై వేర్వేరుగా రెండు చీటింగ్, బెదిరింపుల కేసులు గచ్చిబౌలి పీఎస్‌లో నమోదయ్యాయి. సీఐ జేమ్స్ బాబు తెలిపిన వివరాలిలా.. గచ్చిబౌలిలోని ఎఫ్‌సీఐ కో ఆపరేటివ్ సొసైటీలో తేజ జీహెచ్‌ఎంసీ అనుమతులు లేకుండా భారీ ఇన్ఫినిటీ డ్రైవ్ ఇన్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. సంవత్సరం క్రితం అనుమతులు లేకపోవడంతో జీహెచ్‌ఎంసీ అధికారులు ఇన్ఫినిటీ డ్రైవ్ ఇన్‌ను నేలమట్టం చేసిన విషయం తెలిసిందే. వచ్చిన లాభంలో 5 శాతం ఇస్తానని చెప్పడంతో ఇన్ఫినిటీ డ్రైవ్ ఇన్ నిర్మాణ సమయంలో 2021లో గచ్చిబౌలిలో నివాసం ఉండె ఠాకూర్ ప్రసాద్ రూ.75 లక్షలు ఇచ్చాడు. ఇచ్చిన డబ్బు అడగగా రూ.10 లక్షలు తిరిగి ఇచ్చారు. కళ్యాణ్ చక్రవర్తి అనే వ్యక్తి రూ.10 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చానని వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. రఘు తేజ, అతని తండ్రి వెలగపూడి శ్రీనివాస్‌పై ఐపీసీ 406,420,506 సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని సీఐ జేమ్స్ బాబు తెలిపారు.

నవంబరులో.. 'సన్‌బర్న్'

సాక్షి, సిటీబ్యూరో: ఎలక్ట్రానిక్ డ్యాన్స్ మ్యూజిక్‌కి ప్రపంచ ప్రసిద్ధి చెందిన సన్ బర్న్ మ్యూజిక్ ఫెస్టివల్ నగరంలో మళ్లీ సందడి చేయనుంది. ఈ విషయాన్ని సహ నిర్వాహక సంస్థ అబ్సల్యూట్ గ్లాస్‌వేర్ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈసారి 6 గురు గ్లోబల్ ఆర్టిస్టులు, ఇంటర్నేషనల్ డీజేలు పాల్గొనే ఈ ఈవెంట్ నవంబరులో నగరానికి రానుంది. దేశవ్యాప్తంగా పలు నగరాల్లో 24 ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని, చివరగా ఫైనల్ ఈవెంట్, ప్రపంచ సంగీతాభిమానుల్ని పెద్ద సంఖ్యలో ఆకర్షించే గోవాలో డిసెంబర్ 28 నుండి 31 వరకు జరుగుతుందన్నారు.

సామూహిక కుంకుమార్చన

రాయదుర్గం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం ఖాజాగూడలోని సాయిఐశ్వర్య లేఅవుట్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో సామూహిక కుంకుమార్చన చేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

దేవీశరన్నవరాత్రి ఉత్సవం

కూకట్‌పల్లి నియోజకవర్గంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కన్నులపండువగా జరుగుతున్నాయి. ఆలయాలు, మండపాల్లో అమ్మవారిని రోజుకో రూపంలో భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తున్నారు. మహిళలు సామూహిక కుంకుమార్చన పూజల్లో పాల్గొంటున్నారు. గురువారం మధ్యాహ్నం పలు మండపాల వద్ద నిర్వాహకులు హోమాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

– కూకట్‌పల్లి జోన్ బృందం


మూసాపేటలో గౌరీదేవి అలంకరణలో ఎల్లమ్మతల్లి


సుమిత్రనగర్‌లో ధనలక్ష్మి అలంకరణలో అమ్మవారు


కేపీహెచ్‌బీకాలనీలో శ్రీరాజరాజేశ్వరి అలంకరణలో అమ్మవారు


ఆల్విన్‌కాలనీ భ్రమరాంబమల్లికార్జున స్వామి ఆలయంలో అమ్మవారు


పర్వత్‌నగర్‌లోని పర్వతవర్ధిని శివాలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు


ఆంజనేయనగర్‌లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ బాబూరావు


హస్మత్‌పేటలో అమ్మవారికి పూజలు చేస్తున్న డీఎస్పీ నంద కుమార్ దంపతులు, టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి


అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న గొట్టిముక్కల వెంగళరావు తదితరులు


ప్రగతినగర్ కమ్యూనిటీహాల్‌లో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్

బతుకమ్మ శోభ









కూకట్‌పల్లి నియోజకవర్గంలో బతుకమ్మ పండుగ వేడుకలు వైభంగా జరుగుతున్నాయి. గురువారం కూకట్‌పల్లిలోని హనుమాన్‌చౌక్, వెంకట్‌రావునగర్ కాలనీ, దేవిస్థాన్ హోమ్స్, హైదర్‌నగర్‌లోని వర్టెక్స్ ప్రైమ్, ఆల్విన్‌కాలనీ తదితర ప్రాంతాల్లో బతుకమ్మ ఉత్సవాలు కనులపండువగా నిర్వహించారు. అనంతరం ఐడీఎల్ చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

– కూకట్‌పల్లి జోన్ బృందం


వర్టెక్స్ ప్రైమ్ కమ్యూనిటీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, చిన్నారులు




కూకట్‌పల్లిలో హనుమాన్‌చౌక్, వెంకట్‌రావు నగర్ కాలనీల్లో జరిగిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

ఇంటింటికీ బీజేపీ భరోసా యాత్ర

మోతీనగర్: కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ ఆధ్వర్యంలో గురువారం అల్లాపూర్ డివిజన్‌లోని కొత్తూరు సీతయ్యనగర్ నుంచి ఇంటింటికీ బీజేపీ భరోసా యాత్ర చేపట్టారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు గడప గడపకు వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎక్కువ బూత్‌లు ఉన్న డివిజన్ అల్లాపూర్ అని అన్నారు. ఈ డివిజన్‌లో పార్టీ కార్యకర్తలు కష్టపడి పనిచేసి, పోలింగ్ శాతం పెంచేలా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. ప్రజల్లో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని తీసుకెళ్లానని కోరారు. అనంతరం కేఎస్ నగర్‌లో ఏర్పాటు చేసిన భవాని మాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీలక్ష్మి, విజయ్ వెంకట్‌రెడ్డి, కృష్ణంరాజు, అంకిత్‌సింగ్, సుదర్శన్, కళ్యాణ్, వెంకట్‌రామ్‌రెడ్డి, స్వాతి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


ఇంటింటికీ బీజేపీ భరోసా యాత్రలో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు, బీజేపీ నాయకులు

జంగ్ 2023 తెలంగాణ

కూకట్‌పల్లి కాంగ్రెస్ టికెట్ స్థానికులకే కేటాయించాలి

గొట్టిముక్కల పద్మారావు డిమాండ్

బాలానగర్: బాలానగర్‌లోని ఓ హోటల్‌లో గురువారం కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గొట్టిముక్కల పద్మారావు మాట్లాడుతూ... కూకట్‌పల్లి నియోజకవర్గానికి కాంగ్రెస్ తరపున టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో తాను ఒకరినని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మూడెకరాల భూమిని దళితులకు ఇస్తామని.. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని... అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మాటే మర్చిపోయిందన్నారు. కూకట్‌పల్లి టికెట్‌ను స్థానికులకే టికెట్ కేటాయించాలన్నారు. పారాచూట్ నాయకులను తమపై రుద్దితే సహించేది లేదని హెచ్చరించారు. పారాచూట్ నాయకులను దించినట్లయితే నియోజకవర్గంలో 9 డివిజన్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ఒక్కొక్క డివిజన్ నుంచి 20 మంది చొప్పున ఎమ్మెల్యేగా నామినేషన్లు వేస్తారన్నారు. కాంగ్రెస్ కూకట్‌పల్లి నియోజకవర్గ ఏ-బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్‌రెడ్డి అన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించటమే కానీ ఇంత వరకు ప్రజలెవరికి తాళాలు ఇవ్వలేదన్నారు. చెరువులు కబ్జా అవుతున్నాయని దుయ్యబట్టారు. కార్యక్రమంలో నాయకులు కె. రాజు, కె. రమేష్, సి. కృష్ణ, నరేందర్, ముక్తార్, బాలరాజు, నరేష్, మధుమోహన్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గొట్టిముక్కల పద్మారావు, మాదిరెడ్డి యుగంధర్‌రెడ్డి

ఎమ్మెల్యే విజయానికి కలసికట్టుగా పనిచేయాలి

మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్

మూసాపేట: మూసాపేట డివిజన్‌కు చెందిన మున్ఫిపేట్, చైతన్య బస్తీ, ఇందిరానగర్, జనతానగర్‌లకు చెందిన బూత్‌స్థాయి కార్యకర్తలతో మూసాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాబోయే ఎన్నికల్లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేసి కూకట్‌పల్లి నియోజకవర్గంలో మరోసారి గులాబీ జెండాను రెపరెపలాడించాలని సూచించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో ఏ విధంగా అభివృద్ధి చెందిందో ఇంటింటికి వెళ్లి ఓటర్లకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, రాజ్‌కుమార్, నాని, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

29న జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్ ఎన్నికలు

బంజారాహిల్స్: తెలుగు సినీ అండ్ టీవీ జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్ ఎన్నికలు ఈ నెల 29న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన నోటీసును తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఈ నెల 11న జారీ చేసింది. ఇందులో భాగంగా గురువారం జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్ అధ్యక్ష పదవికి స్వామిగౌడ్, ప్రధాన కార్యదర్శి పదవికి వల్లభనేని అనిల్‌కుమార్, కోశాధికారి పదవికి శేషగిరిరావు చిక్కడపల్లిలోని కార్మిక శాఖ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ శ్యాం సుందర్‌రెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు. 2023-25 సంవత్సరాలకుగాను నూతన కార్యవర్గం ఎన్నిక కానుంది. ఎన్నికల షెడ్యూల్‌లో భాగంగా ఈ నెల 19న నామినేషన్ల స్వీకరణతో పాటు నామినేషన్ల తనిఖీ చేపట్టి తుది జాబితాను కూడా వెల్లడించారు. ఈ నెల 21న నామినేషన్ల ఉపసంహరణ, అదే రోజు గుర్తుల కేటాయింపు కూడా చేపట్టనున్నారు. అర్హత గల ఓటర్ల జాబితాను ఫెడరేషన్‌కు అందజేశారు. మొత్తం 4400 మంది జూనియర్ ఆర్టిస్టులు ఈ ఎన్నికల్లో ఓట్లు వేయనున్నారు.


నామినేషన్ దాఖలు చేస్తున్న వల్లభనేని అనిల్‌కుమార్

బతుకమ్మ వేడుకల్లో సీరియల్ నటి విష్ణుప్రియ

వెంగళరావునగర్: బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని ప్రముఖ సీరియల్ నటి విష్ణుప్రియ అన్నారు. మధురానగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఘనంగా బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విష్ణుప్రియ మాట్లాడుతూ... ప్రతి మహిళకు అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరారు. బీఆర్‌ఎస్ జూబ్లీహిల్స్ అభ్యర్థి గోపీనాథ్, కార్పొరేటర్ దేదీప్య పాల్గొన్నారు.

గంజాయి, చరస్ విక్రేతల అరెస్ట్

- 1.10 కిలోల గంజాయి, 78 గ్రాముల చరస్ స్వాధీనం
- ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శంషాబాద్ జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి

హఫీజ్‌పేట్ : గంజాయి, చరస్ ప్యాకెట్లను విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసిన ఘటన శేరిలింగంపల్లి మండల ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శంషాబాద్ జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన ప్రకారం వివరాలు...రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన నీలేష్ ఇండోరియా (28), మనీష్ (20)లు గత రెండు సంవత్సరాల క్రితం నగరంలోని ఫతేనగర్‌కు బతుకుదెరువు కోసం వచ్చారు. సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో గత ఆరు నెలల నుంచి వివిధ రాష్ట్రాల నుంచి గంజాయి, చరస్‌లను తీసుకువచ్చి ఐటీ కంపెనీలకు చెందిన ఉద్యోగులకు విక్రయిస్తున్నారు. గురువారం నానక్‌రామ్‌గూడ విప్రో జంక్షన్ ప్రాంతాలలో వీరిద్దరు తిరుగుతుండగా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ డేవిడ్ రవికాంత్, శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సత్యనారాయణ ఆదేశాల మేరకు డీటీఎఫ్ బృందం వారిద్దరినీ అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద 20 గ్రాముల చరస్, 60 గ్రాముల గంజాయి ప్యాకెట్లు దొరికాయన్నారు. విచారణలో ఫతేనగర్‌లోని వారి ఇంట్లో గంజాయి, చరస్‌లు ఉన్నాయని తెలుపడంతో అక్కడకు వెళ్లి తనిఖీలు చేయగా మరో 58 గ్రాముల చరస్, 970 గ్రాముల గంజాయి ప్యాకెట్లు దొరికాయన్నారు. మొత్తం 1.10 కిలోల గంజాయి, 70 గ్రాముల చరస్ ప్యాకెట్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ సుమారు రూ.8.5 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు గంజాయి విక్రేతల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఎక్కడైనా ఎవరైన అమ్మితే వెంటనే తమకు సమాచారం అందించాలని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు ప్రజలకు సూచించారు. ఈ సమావేశంలో శంషాబాద్ డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.


సమావేశంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శంషాబాద్ జిల్లా అధికారులు

తిరుమలలో ఎమ్మెల్యే పూజలు



కూకట్‌పల్లి: ముఖ్యమంత్రిగా మూడోసారి కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేయాలని కోరుకుంటూ తిరుమలలో కలియుగ దైవం వేంకటేశ్వరస్వామిని గురువారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్‌లు దొడ్ల వెంకటేష్ గౌడ్ జూపల్లి సత్యనారాయణ దర్శించుకున్నారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ మూడోసారి ప్రమాణస్వీకారం చేస్తే కూకట్‌పల్లి నుంచి తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు పాదయాత్ర చేస్తానని మొక్కుకున్నట్లు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తెలిపారు.

ముకుంద జ్యువెలర్స్ ప్రారంభం



సాక్షి,సిటీబ్యూరో: వ్యాపార విస్తరణలో భాగంగా గురువారం ముకుంద జ్యువెలర్స్ నూతన బ్రాంచ్‌ను ఖమ్మంలో సినీనటి కావ్య ప్రారంభించారు.

'కాంగ్రెస్ పార్టీకే గ్యారంటీ లేదు'

హిమాయత్‌నగర్: ఆరు గ్యారంటీలు అంటున్న కాంగ్రెస్ పార్టీకే రాష్ట్రంలో గ్యారంటీ లేదని ఎమ్మెల్యే దానం నాంగేందర్ ఎద్దేవా చేశారు. అభివృద్ధి కావాలంటే సీఎం కేసీఆర్ రావాలని, కేసీఆర్ సీఎం కావాలంటే నాలాంటి ఎమ్మెల్యేలు తెలంగాణలో గెలవాలని దానం అన్నారు. హిమాయత్‌నగర్ ఎంపీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో హిమాయత్ నగర్ డివిజన్ ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే దానం నాగేందర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

నైపర్‌లో స్వచ్ఛతా మార్చ్


స్వచ్ఛతా మార్చ్‌లో పాల్గొన్న నైపర్ అధ్యాపకులు, విద్యార్థులు

బాలానగర్: పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్యాన్ని కాపాడుతుందని నైపర్ ప్రొఫెసర్ శంకరయ్య అన్నారు. గురువారం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైపర్) బాలానగర్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా మార్చ్ కార్యక్రమం నిర్వహించారు. నైపర్‌లోని విద్యార్థులు, ఆచార్యులు, సిబ్బంది బాలానగర్‌లోని ఇండస్ట్రియల్ ప్రాంతంలో స్వచ్ఛతా మార్చ్‌ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆచార్యులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణని కాపాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచటంతో మన వంతు పాత్ర పోషించాలన్నారు.